క్లుప్తంగా

పోరుమామిళ్లలో ముగిసిన యోగా మహోత్సవం

పోరుమామిళ్ల : గత మూడు రోజులుగా పోరుమామిళ్లలోని గుడుగుంట్ల అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న యోగా మహోత్సవం మంగళవారం రాత్రి ముగిసింది. కేంద్ర సాంస్కృతిక శాఖ, రామచంద్ర మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగా మహోత్సవం నేపథ్యంలో పోరుమామిళ్లలో హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ సత్యప్రవీణ్ ఆధ్వర్యంలో మూడు రోజులు విజయవంతంగా కొనసాగింది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



మెడల్స్ సాధించిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైస్పేస్ తైక్వాండో అకాడమి క్రీడాకారిణి బి.అభినయ ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి 5వ క్యాడెట్ తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరచింది. 59 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి ఈనెల 27 నుంచి 30 వరకు రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. అలాగే అండర్ 45 కిలోల విభాగంలో షణ్ముఖ రజతం, 51 కిలోల విభాగంలో ఇర్ఫాన్ కాంస్య పతకం సాధించారు. వీరిని కోచ్ సలీం, జిల్లా తైక్వాండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయబ్‌రసూల్, ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, ఇన్‌స్ట్రక్టర్ సంతోష్ అభినందించారు.

సగిలేరు గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ల: సగిలేరు గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నిరంజన వరప్రసాద్ తెలిపారు. ఈనెల 24 లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ లేదా సగిలేరు గురుకుల పాఠశాలకు ధ్రువీకరణ పత్రాలతో వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9347558248, 8919423907 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

గోపవరం : జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ లబ్ధిదారులను, ఏజెన్సీ నిర్వాహకులను కోరారు. మంగళవారం కాలువపల్లెలో జగనన్న ఇళ్ల నిర్మాణాలను సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ నెల 23వ తేదీన సామూహిక గృహ ప్రవేశాలు ఉన్నందున 22వ తేదీ లోపు అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని తెలిపారు. ప్రత్యేకాధికారి వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్‌లో ఉచిత శిక్షణ

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ , వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్, సర్వీసింగ్(30రోజులు), సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్(13రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్. నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల చెందిన యువకులకు ఈనెల 16 నుంచి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–45 ఏళ్లలోపు వయసు కలిగిన నిరుద్యోగ యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు ట్రైనింగ్ సెంటర్ ఈ మెయిల్‌కు వివరాలు పంపవచ్చన్నారు. వివరాలకు 9440905478, 6302833548 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : ప్రభుత్వ ఐటీఐలో మూడునెలల పాటు స్వల్పకాలిక శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మైలవరం, జమ్మలమడుగు ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్స్ మత్తెశులు, నవరూప్‌కుమార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌసల్య విద్య యోజన(పీకేవై) పథకం ద్వారా తదితర కోర్సుల కోసం అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీలోపు సర్టిఫికేట్లతోపాటు అధార్‌కార్డు, కలర్‌ఫొటో తీసుకుని వచ్చి ఐటీఐలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారంలాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తుల సంఖ్య ఊహించని విధంగా పెరగడంతో ఆ ప్రాంగణంలో చోటు చాలలేదు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు తెలిపారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

‘ఆల్బెండజోల్’పై అపోహలొద్దు

ప్రొద్దుటూరు క్రైం : ఎలాంటి అపోహలు చెందకుండా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశిభూషణ్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా పట్టణంలోని పాలిటెక్నిక్ కాలేజీ, బ్రిలియంట్ హైస్కూల్, జీవనజ్యోతి స్కూల్, అంగన్‌వాడి కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి మాట్లాడుతూ నులిపురుగుల నివారణ కోసం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలలు, అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మాత్రలను 6 నెలలకు ఒకసారి మింగించడం వల్ల నులిపురుగులను నివారించవచ్చన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, కోదండరాం, సీఓ నాగజ్యోతి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేషనల్ డీ వార్మింగ్ డే విజయవంతం

మండల పరిధిలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం నిర్వహించిన నేషనల్ డీ వార్మింగ్ డే కార్యక్రమం విజయవంతమైనట్లు డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అన్ని అంగన్‌వాడి కేంద్రాలతో పాటు పాఠశాలలు, కళాశాలల్లోని 1–19 ఏళ్ల వారికి నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమం అమలు తీరును ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శాంతికళ, మండల అభివృద్ధి అధికారి ఉపేంద్ర, ఎంఈఓ సావిత్రమ్మ పరిశీలించారు.

నులిపురుగుల మాత్రల పంపిణీ

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.నారాయణరెడ్డి, అధ్యాపకులు నులిపురుగులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రాజెక్ట్ వైద్యాధికారి శశిభూషన్, మండల విద్యాధికారి రవిశంకర్ లు హాజరై విద్యార్థుల చేత ఆల్‌బెండజోల్ మాత్రలను తినిపించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలతో పాటు 19 ఏళ్లు కలిగిన ప్రతి ఒక్కరికీ మాత్రలను పంపిణీ చేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్‌కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాలుడికి మాత్రలను తినిపిస్తున్న ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశిభూషణ్

దువ్వూరు : మండల పరిధిలోని చల్లబసాయపల్లె, పుల్లారెడ్డిపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జాతీయ నులి పురుగుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సమీర మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. భోజనానికి ముందు, భోజనం తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆల్‌బెండజోల్ మాత్రలను విద్యార్థులకు అందించడం వలన నులి పురుగులను నివారించి రక్తహీనతను నిర్మూలించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి శివజ్యోతి, పాఠశాల ఎస్‌ఓ మల్లేశ్వరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



ప్రొద్దుటూరులో బాలుడికి మాత్రలను తినిపిస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా

బ్రహ్మంగారిమఠం : వైద్య సిబ్బందికి విధి నిర్వహణలో అప్రమత్తతతో వ్యవహరించాలని జిల్లా మలేరియా అధికారిని మనోరమ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిచారా లేదా అనేదానిపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అధికంగా నులిపురుగులు ఉండే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు పరిశుభ్రంగా చేతులు కడుక్కున్న తరువాత ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పలనిరాజు, ఏఎంఓ వెంకటరెడ్డి, సీహెచ్‌ఓ సాంబశివారెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్లు పుష్పరాజ్, ఎల్‌వీ రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్లు మాధవ నాయుడు, వెంకటసుబ్బయ్య, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, ఇందుకోసం పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే గోడపత్రాలను వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న స్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్‌అసిస్టెంట్ మహమ్మద్ ఖాసీం, శ్రీరాములయ్య తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

గోపవరం : నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను వాడాలని మండల వైద్యాధికారి డాక్టర్ నర్మద తెలిపారు. మంగళవారం గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ గోపవరం సరస్వతి, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, సీహెచ్‌ఓ గౌస్, సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ఏఎన్‌ఎం సుజాత పాల్గొన్నారు.

బి.కోడూరు : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఆల్బెండజోల్ మాత్రలు మింగించామని మండల వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఎ.ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి టి.నరసింహారెడ్డి, సీహెచ్‌ఓ కె.నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



కలసపాడులోని సెయింట్ ఆంటోనీస్ పాఠశాలలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ సాయికుమార్



బ్రహ్మంగారిమఠం: కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

అట్లూరు : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఎంపీడీఓ జె.సుజాతమ్మ, మండల వైద్యాధికారి డాక్టర్ కె.హమీద బేగం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఎంఈఓ విల్సన్, సీహెచ్‌ఓ సి.మురళీకృష్ణ, పీహెచ్‌ఎన్ ఎం.లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కలసపాడు : విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ సాయికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక సెయింట్ ఆంటోనీస్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం స్వచ్ఛమైనదిగా ఉండాలని సూచించారు.

కాశినాయన : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న విద్యార్థులకు, చిన్నారులకు మంగళవారం 5060 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు మింగించినట్లు నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు.

‘ఎమ్మెల్సీ’ ఫలితాలు ఏకపక్షంగా ఉంటాయి

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు వైఎస్సార్‌సీపీకి ఏకపక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగడానికి అటు పోలీసు, ఇటు ప్రభుత్వ అధికారులు కృషి చేసినందుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

పోలింగ్ రోజున ఇంటి నుంచి బయటికి రాలేదు

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఆశయంతోనే తాను హౌస్ అరెస్టును తలపించేలా ఇంటికే పరిమితమయ్యానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. టీడీపీ నాయకులు పుత్తా నరసింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి హల్‌చల్ చేశారన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో 10138 మంది, ఉపాధ్యాయ ఎన్నికల్లో 1123 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.



మట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ఓటుకు నోటు కేసులో పట్టుబడ్డ చంద్రబాబు విమర్శించడమా..

డబ్బులిచ్చి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన వ్యవహారంలో బయటపడ్డ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో పెట్టే డబ్బు గురించి ప్రస్తావించడం సిగ్గుచేటైన విషయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. 40 ఏళ్లలో ఏనాడైన డబ్బులు పంచకుండా ఎన్నికలు నిర్వహించారా అని ప్రశ్నించారు. ప్రజలందరూ వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని, టీడీపీకి పశ్చిమ రాయలసీమలో 60వేల ఓట్లు వచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. అబద్ధాన్ని కప్పి పుచ్చుకునేందుకు చంద్రబాబు వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్నికల పొత్తులు అనైతికమని ఎమ్మెల్యే రాచమల్లు విమర్శించారు. అన్ని పార్టీలు రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంటే, జగన్ జనంతో మాత్రమే పొత్తు పెట్టుకుని సింగిల్‌గా పోటీ చేస్తుందన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లు దాతృత్వం

ఇద్దరు చిన్నారుల భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రూ.5లక్షల మొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. జమ్మలమడుగు నియోజకవర్గం పరిధిలోని వేపరాలకు చెందిన కరుమూరు బాబు భార్య స్వర్ణకుమారి ప్రొద్దుటూరు మండలంలోని చౌటపల్లె గ్రామంలో మహిళా పోలీసుగా పనిచేసేది. రెండో ప్రసవం కోసం గత నెల 23న ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రాగా ఆమె బిడ్డకు జన్మనిచ్చి అధిక రక్తస్రావంతో మరణించింది. స్వర్ణకుమారి దంపతుల ఇద్దరి పిల్లల కోసం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఈ మొత్తాన్ని ఆర్థిక సహాయంగా అందించారు.

హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలి

మైదుకూరు : ప్రతి ఒక్కరూ హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలని చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్ స్కీం ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు తెలిపారు. మండలంలోని మిట్టమానుపల్లె ఎస్సీ కాలనీలో మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా వారు హెచ్ఐవీ, టీబీ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన వారు ఏఆర్టీ మందులు వాడుతూ జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న ఓబుళమ్మ, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధులు దర్బార్, షహనేర్ భాను, సచివాలయ ఉద్యోగులు విజయలక్ష్మి, చంద్రావతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

హుండీ ఆదాయం రూ.10.29 లక్షలు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి ఆలయాల్లోని హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు.

పర్యవేక్షణ అధికారి శివయ్య, ఈఓ బీవీ నరసయ్య, ఆలయ ఛైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. ఆరు నెలలకు గాను రూ.10,29,159 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, రామచంద్రారెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు


ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయంలోని ప్రధాన ఆలయాలు, ఉప ఆలయాలు, గోశాలలోని హుండీలను లెక్కించగా మూడు నెలలకు గాను రూ.2,11,079లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ శంకరబాలాజీ, నంద్యాల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



రాజుపాళెం : వెల్లాల పుణ్యక్షేత్రంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

శారీరక ఎదుగుదలపై విద్యార్థినులకు అవగాహన

బద్వేలు : పోరుమామిళ్లలోని ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్, మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు శారీరక ఎదుగుదల, రుతుక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యురాలు డాక్టర్ మౌనికరెడ్డి, ట్రస్టు ప్రతినిధి ప్రజ్వలరెడ్డిలు మాట్లాడుతూ పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, మంచి ఆరోగ్యం కోసం చక్కని పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ట్రస్టు ప్రతినిధులు తోమస్‌రెడ్డి, గీతాఏరువ సహకారంతో విద్యార్థినులకు రుతుక్రమంపై కామిక్స్ రూపంలో తయారు చేసిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అమెరికా నుంచి విచ్చేసిన దంపతులు జేమ్స్‌గిల్‌క్రిస్ట్, జీనాలు పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు.



పుస్తకాన్ని విద్యార్థినికి అందజేస్తున్న జీనా

కారల్ మార్క్స్‌కు నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవిద్య జూనియర్ కళాశాలలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ వర్ధంతిని నిర్వహించారు. కారల్ మార్క్స్ ‘ప్రపంచ కార్మికులారా ఏకంకండి’ అనే నినాదంతో ప్రపంచాన్ని మేల్కొలిపిన మహనీయుడని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేష్, అనిల్, మోహన్, నీవన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదుపై సామాజిక తనిఖీ

గోపవరం : మండలంలో రబీలో సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేసిన జాబితాపై గ్రామసభల ద్వారా సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. మంగళవారం మండలంలోని కాలువపల్లె రైతుభరోసా కేంద్రంలో ఏఓ అరవింద నాయక్‌తో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అన్ని రైతుభరోసా కేంద్రాల పరిధిలో పంట నమోదు జాబితాపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ఆర్బీకేల పరిధిలో పంట నమోదు చేయించుకున్న రైతుల వివరాలను చదివి వినిపిస్తామన్నారు. ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే విషయం గ్రామసభ ద్వారా తెలియపరిచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే రైతుల నుంచి స్వీకరిస్తామని తెలిపారు. 18వ తేదీ తుది జాబితా విడుదల చేస్తామన్నారు.



కాలువపల్లె గ్రామసభలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక నెహ్రూరోడ్డులోని వేదవ్యాస డిగ్రీకళాశాల విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో గ్రామీణ డాక్ సేవక్ ఫలితాల్లో కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కె.కావ్య, జి.రాహుల్, సి.వసంత్‌లు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి, ప్రెసిడెంట్ సుదర్శనరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజ, రామలక్ష్మిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ముగిసిన మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలు

గోపవరం : మహాకవయిత్రి మొల్లమాంబ సాహితీ జయంతి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయని సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొల్ల సాహితీ జయంతి ఉత్సవాల్లో మొల్ల రామాయణం వ్యాప్తితో పాటు విద్యార్థులు, మహిళల్లో చైతన్యం వెల్లివిరిసిందన్నారు. ఈ నెల 7వ తేదీన గోపవరంలో ప్రారంభమైన మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఏడు చోట్ల విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో కవులు, పండితులకు మొల్ల సాహితీ సేవా పురస్కారాలు ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, సభ్యులు కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న గానుగపెంట హనుమంతరావు

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ గ్రంథాలయానికి కడపకు చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ఎంవీ మధుసూదన్‌రెడ్డి, జె.శిల్ప ఇంజినీరింగ్ పుస్తకాలను వితరణగా ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపా ప్రొఫెసర్ సి.నాగరాజుకు మంగళవారం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి 33, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి 7, ఇతర విభాగాలకు చెందిన 30 పుస్తకాలను వారు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ప్రొఫెసర్ కె.వెంకటరమణయ్య, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగరాజుకు పుస్తకాలు అందిస్తున్న దాతలు

లయోలా పాల్‌టెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : ఈనెల 11, 12వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన నాల్గవ సౌత్ ఇండియా జోనల్ ఇంటర్ పాల్‌టెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌లో పులివెందుల లయోలా పాల్‌టెక్నిక్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో తెలిపారు. మంగళవారం స్థానిక లయోలా పాల్‌టెక్నిక్ కళాశాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్‌లో కమలాకర్ ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో దినేష్‌కుమార్, లాంగ్ జంప్‌లో బానుప్రకాష్ రెడ్డి ద్వితీయ స్థానాలలో నిలిచారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ విజయరాజు, కళాశాల పీఈటీ గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.